HICON SERIES

CLASS 4 TERM-1

# తెలుగు భారతి

LESSON 5






CLICK HERE TO ACTIVATE

**LESSON**
PART 2

# 5. గోదావరి

పూర్వ కాలంలో మానవులు నదీ తీరంలోనే నివాసాలు ఏర్పాటు చేసుకొనేవారు. ఎందుకనగా మానవులకు నీరే ప్రాణాధారం, జీవనాధారం. మనదేశంలో గంగ, సింధు, బ్రహ్మపుత్ర, కృష్ణ, గోదావరి వంటి జీవనదులున్నాయి. నదీ-నదములు ఏదేశంలో అధికంగా ఉంటాయో ఆ దేశం త్వరితగతిన అభివృద్ధి చెందుతుంది.



దక్షిణ భారతదేశంలోని పెద్ద నది గోదావరి నది. అందుకే దీనిని "దక్షిణ గంగ" అని పిలుస్తారు. ఈ నది మహారాష్ట్రలోని పడమటి కనుమలలో నాసిక్ జిల్లాలో "నాసికాత్రయంబకం" అనేచోట పుట్టింది. ఇది నిజామాబాద్ జిల్లాలోని 'కందకుర్తి' అనే గ్రామం వద్ద తెలంగాణా రాష్ట్రంలోకి ప్రవేశిస్తుంది. అక్కడి నుండి పశ్చిమ గోదావరి జిల్లాలోని పోలవరం దగ్గర ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవేశిస్తుంది.

ఈ నదిపై అనేక ఆనకట్టలను నిర్మించారు. దీని నీరు వ్యవసాయానికి, త్రాగడానికి, విద్యుచ్ఛక్తి ఉత్పత్తికి కూడా ఉపయోగపడుతుంది. దీనిపైన మహారాష్ట్రలో "జయక్ వాడి" ఆనకట్ట, తెలంగాణా రాష్ట్రంలో పోచంపాడు వద్ద శ్రీరాంసాగర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ధవళేశ్వరం వద్ద ధవళేశ్వరం ఆనకట్టలను నిర్మించారు. ధవళేశ్వరం ఆనకట్టను సర్ ఆర్థర్ కాటన్ అనే బ్రిటీష్ ఇంజనీర్ నిర్మించారు.




గోదావరి పుట్టుక గురించిన అనేక కథలు పురాణాల్లో ఉన్నాయి. గో - అనగా జలం అని, దా - అనగా ఇచ్చునది అని, వర - అనగా శ్రేష్ఠమైనది అని అర్థం. శ్రేష్ఠమగు జలాన్ని ఇచ్చేది కాబట్టి దీనికి 'గోదావరి' అనే పేరు వచ్చింది.

గోదావరి జన్మస్థలమైన 'త్రయంబకం' ఒక పుణ్యక్షేత్రం. ఇక్కడ ఉన్న దేవుని పేరు త్రయంబకేశ్వరుడు. ఇది ఒక ప్రముఖ యాత్రాస్థలం. ఈ నది ఒడ్డున ఉన్న మరొక పుణ్యక్షేత్రం తెలంగాణాలోని బాసర. ఇక్కడ సుప్రసిద్ధ సరస్వతీదేవి ఆలయం ఉన్నది. చిన్న పిల్లలకు బాసరలో అక్షరాభ్యాసం చేయించటం బాగా ప్రచారంలో ఉన్న సంప్రదాయం.

జగిత్యాల జిల్లాలో ధర్మపురి దగ్గర ఈ నది ఒడ్డున నరసింహస్వామి ఆలయం ఉన్నది. ఇక్కడి మూలవిరాట్టు పద్మాసనంలో ఉంటాడు. ధర్మవర్మ అనే రాజు ఈ ఆలయాన్ని నిర్మించాడు.

గోదావరి నదిలో ప్రాణహిత అనే ఉపనది కలిసేచోట కాళేశ్వర క్షేత్రం ఉంది. ఇక్కడి ఆలయాలలో ప్రసిద్ధిగాంచినది ముక్తేశ్వరాలయం. గర్భగుడిలో రెండు శివలింగాలు ఉండడం ఇక్కడి ప్రత్యేకత. ఇక్కడ ఒక బ్రహ్మగుడి కూడా ఉన్నది.



తెలుగు వారికి భద్రాద్రిరాముడు ఎంతో ఆప్యాయతతో, భక్తితో కొలుచుకొనే దైవం. గోదావరి నది ఒడ్డున భద్రాద్రి-కొత్తగూడెం జిల్లాలో ఈ ఆలయాన్ని తమ్మల దమ్మక్క నిర్మించింది. తర్వాత గోల్కొండ పాదుషా తానీషాచే తహసీల్దారుగా నియమించబడిన కంచర్ల గోపన్న దీనిని పునర్నిర్మించాడు. ఈయననే భక్త "రామదాసు" అంటారు. శ్రీరామనవమికి ఇక్కడ సీతారామ కళ్యాణం అత్యంత వైభవంగా జరుగుతుంది.

ఈ నది ఒడ్డున ఉన్న మరొక పురాతన పట్టణం ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రి. ఈ పట్టణాన్ని పూర్వం రాజమహేంద్రవరం అని పిలిచేవారు. ఈ నగరాన్ని అనేక మంది రాజులు రాజధానిగా చేసుకొని పరిపాలించారు. ఆదికవి నన్నయ్యభట్టు ఇక్కడి వాడే. రాజరాజనరేంద్రుడు అనే గొప్ప రాజు ఈ నగరాన్ని రాజధానిగా చేసుకొని పరిపాలించడం వలన దీనికి రాజమహేంద్రవరం అనే పేరు వచ్చింది.

ఈ నది రాజమండ్రి, ధవళేశ్వరం దగ్గర రెండుగా చీలిపోతుంది. వీటిలో తూర్పు పాయను 'గౌతమి' అని, పడమటి పాయను 'వసిష్ఠ' అని పిలుస్తారు. సముద్రంలో కలవటానికి ముందుగా ఈ నది ఏడు పాయలుగా చీలిపోతుంది. వీటిని 'సప్తగోదావరులు' అని పిలుస్తారు. ఈ నది పొడవు 1465 కి.మీ.



## అభ్యాసము

I. అర్థాలు :

| | | |
|---|---|---|
| ప్రగతి | = | అభివృద్ధి |
| కనుమ | = | కొండల మధ్య ఉండే సందు |
| ఉత్పత్తి | = | తయారు చేయడం |
| నిర్మించుట | = | కట్టుట |
| పురాణాలు | = | ప్రాచీన కథలు |
| జలం | = | నీరు |
| శ్రేష్ఠమైన | = | మంచిదైన |
| పునర్నిర్మించుట | = | తిరిగి నిర్మించుట |

II. ఈ క్రింది ప్రశ్నలకు ఒక్క వాక్యంలో జవాబులు వ్రాయండి.

1. గోదావరి నది ఎక్కడ పుట్టింది ?
2. గోదావరిపై ధవళేశ్వరం వద్ద ఎవరు ఆనకట్ట నిర్మించారు ?
3. గోదావరిలో కలిసే ఉపనది ఏది ?
4. బ్రహ్మకు ఎక్కడ గుడి ఉన్నది ?
5. నన్నయ్య బిరుదు ఏమిటి ?
6. గోదావరి నది పొడవెంత ?

III. క్రింది ఖాళీలను పూరించండి.

1. మహారాష్ట్రలోని ఆనకట్ట పేరు ____________________
2. ద్రాక్షారామం ____________________ సమీపంలో ఉన్నది.
3. గోదావరి జన్మస్థలం ____________________
4. గోదావరిపాయలలో పడమటి పాయను ____________________ అని పిలుస్తారు.

IV. బహువచనాలు వ్రాయండి.

1. నివాసం – ______________ 2. జీవనది – ______________

3. పురాణం – ______________ 4. క్షేత్రం – ______________

5. లింగం – ______________ 6. మండపం – ______________

V. వ్యతిరేకపదాలు వ్రాయండి.

1. పురాతన × ______________ 2. ప్రగతి × ______________

3. ఆప్యాయత × ______________ 4. ప్రసిద్ధి × ______________

5. తూర్పు × ______________ 6. పొడవు × ______________

VI. క్రింది పదాలతో సొంతవాక్యాలు వ్రాయండి.

1. నిర్మించుట : ..............................................................................................

..............................................................................................................

2. శ్రేష్ఠమైన : ..............................................................................................

..............................................................................................................

3. పుణ్యక్షేత్రం : ..............................................................................................

..............................................................................................................

4. నిదర్శనం : ..............................................................................................

..............................................................................................................

5. ఉత్పత్తి : ..............................................................................................

..............................................................................................................

VII. జతపరచండి.

| | | | |
|---|---|---|---|
| 1. బాసర | ( ) | (క) | నరసింహస్వామి ఆలయం |
| 2. ధర్మపురి | ( ) | (గ) | కాళేశ్వరాలయం |
| 3. భద్రాచలం | ( ) | (చ) | త్రయంబకేశ్వరుడు |
| 4. కాళేశ్వరం | ( ) | (జ) | సరస్వతీ దేవి ఆలయం |
| 5. త్రయంబకం | ( ) | (ట) | రామాలయం |

VIII. సరైన సమాధానం గల అక్షరాన్ని బ్రాకెట్టులో వ్రాయండి.

1. గోదావరి నది ఈ ప్రాంతంలో పుట్టింది. ( )

(క) శేషాచలం (గ) పాలకొండలు (చ) నాసికాత్రయంబకం

2. శ్రీరాంసాగర్ ఆనకట్ట ఏ నదిపై నిర్మించారు ? ( )

(క) గోదావరి (గ) ప్రాణహిత (చ) కృష్ణానది

3. ఎక్కడి గర్భగుడిలో రెండు శివలింగాలుండడం ప్రత్యేకత ? ( )

(క) ధర్మపురి (గ) కాళేశ్వర క్షేత్రం (చ) త్రయంబకం

4. భద్రాచలం ఏ జిల్లాలో ఉన్నది ? ( )

(క) కరీంనగర్ (గ) భద్రాద్రి-కొత్తగూడెం (చ) వరంగల్

IX. ఈ క్రింది ప్రశ్నలకు జవాబులు వ్రాయండి.

1. గోదావరిపై నిర్మించిన ఆనకట్టలేవి ?
2. గోదావరికి ఆ పేరు ఎందుకు వచ్చింది ?
3. బాసర గురించి మూడు వాక్యాలు వ్రాయండి.
4. భద్రాచలంలోని దేవాలయాన్ని ఎవరు పునర్నిర్మించారు ?
5. గోదావరి నది బంగాళాఖాతంలో ఎక్కడ కలుస్తుంది ?

X. మీ పాఠంలో వచ్చిన భాషాభాగాలను గుర్తించి వ్రాయండి.

| క్ర.సం | నామవాచకం | సర్వనామం | విశేషణం | అవ్యయం |
|---|---|---|---|---|
| 1. | | | | |
| 2. | | | | |
| 3. | | | | |
| 4. | | | | |